క్లుప్తంగా

తాగునీటిని వృథా చేస్తే జరిమానా

హుస్నాబాద్: వేసవిలో తాగునీటిని వృథా చేసే వారికి జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పట్టణ ప్రజలు మిషన్ భగీరథ నీటిని వృథా చేయకూడదని పేర్కొన్నారు. సరిపడా నీటిని వినియోగించిన తర్వాత నల్లా కనెక్షన్ ఆఫ్ చేయాలని సూచించారు. ఆన్ ఆఫ్ లేని వారు బటన్ అమర్చుకోవాలన్నారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు నీటిని వృథా చేసినట్లు గమనిస్తే రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

మద్దూరు(హుస్నాబాద్): నాగర్ కర్నూల్ జిల్లాలోని కోడేరు మండల ఎంపీడీవో శ్రవణ్ కుమార్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం ఎంపీడీవో రామ్మోహన్ తన సిబ్బందితో కలిసి నల్లబాడ్జీలు ధరించి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రవణ్‌కుమార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల న్నారు. ప్రభుత్వ అధికారులపై రాజకీయ నాయకులు దాడి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తలకొరివి పట్టిన కూతురు

మర్కూక్(గజ్వేల్): పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దేవి శంకర్(45) వ్యవసాయ పనులు చేసేవాడు. అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు శారద, శ్రావణి, శాలిని ఉన్నారు. కుమారుడు లేకపోవడంతో పెద్ద కూతురు శారద అంత్యక్రియలు నిర్వహించింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ధనలక్ష్మీ కృష్ణ, మర్కూక్ మాజీ సర్పంచ్ భాస్కర్, నాయకులు బాల్‌రాజు, రమేష్ పాండు, రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కించారు. మంగళవారం సిద్దిపేట ఉమా పార్థివ కోటిలింగేశ్వరస్వామి ఆలయ పర్యవేక్షకుడు పి.చంద్రకుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన హుండీతో పాటు పోచమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల హుండీలను లెక్కింపు చేపట్టారు. 2024 ఫిబ్రవరి 20 నుంచి ఈనెల 19 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మొత్తం రూ.84,986, డిజిటల్ స్కానర్ల ద్వారా రూ.6,247 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విశ్వనాథశర్మ, ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, సభ్యులు ఇమ్మడి శోభ, ధరావత్ సరిరాం, బ్రహ్మచారి, సాంబయ్య, మాజీ చైర్మన్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. మంగళవారం రామునిపట్ల, గుర్రాల గొందికి చెందిన కాంగ్రెస్ నాయకులు సిద్దిపేట జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి గ్రామాల సమస్యలను వివరించారు. రామునిపట్ల గ్రామ సీఎస్ఐ చర్చిలో బోరు మోటార్ వేయించాలని, ప్రహరీ నిర్మించాలని ఆయనకు చర్చి ఫాదర్లు వినతి పత్రం అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

బెజ్జంకి(సిద్దిపేట): విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకిలో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్షుడు శానగొండ నర్సింహాచారి మంగళవారం తెలిపారు. పూజల వివరాలు వెల్లడించారు.

త్వరలో ఓపెన్ జిమ్

- మంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- మరొక జిమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు
- సద్వినియోగం చేసుకోవాలన్న వ్యాయామ నిపుణులు



అక్కన్నపేటలోని మర్రిచెట్టు సమీపంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. త్వరలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారని మాజీ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముత్యాల సంజీవ్‌రెడ్డి తెలిపారు. దాత మండల కేంద్రానికి చెందిన నార్లపురం రాజేశం సహకారంతో సుమారుగా రూ.5 లక్షల వ్యయంతో ఈ జిమ్ ఏర్పాటు చేశారు.

ఫిట్‌నెస్ పెంపొందించేందుకు..

జిమ్‌లకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా ప్రజలకు ఆహ్లాదంతో పాటు వారిలో ఫిట్‌నెస్ పెంపొందించేందుకు స్థానికులు శ్రీకారం చుట్టారు. దాత సహకారంతో ఓపెన్ జిమ్ మర్రి చెట్టు సమీపంలో ఏర్పాటుచేశారు. బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేయడం కొత్త అనుభూతిని కలిగిస్తున్నదంటున్నారు. కాగా ఇటీవల మంత్రి పొన్నం కూడా మరో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ జిమ్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటుచేయనున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి తెలిపారు. దాత సహకారంతో మర్రి చెట్టు సమీపంలో ఏర్పాటుచేశారు. ఇలా అక్కన్నపేటలో రెండు దిక్కులా ప్రజలకు అందుబాటులో అందుబాటులోకి రానున్నాయి. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



మెట్ల పూజలో పాల్గొన్న భక్తులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ 22వ వార్షికోత్సవం వేడుకల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు పోలోజు భానుమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, స్థాపిత దేవతా పూజలు, అయ్యప్ప స్వామి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, విశేష పూజా కార్యక్రమం, అగ్ని ప్రతిష్ఠ, హోమం, శ్రీ ధర్మశాస్తా మూల మంత్రహోమం, దిక్పాలక బలి, పూర్ణాహుతి, దివ్యపదునెట్టాంబడి పూజా (మెట్ల పూజా)జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్నవార్షిక బ్రహ్మోత్సవాలు



మంగళస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి (పాత) ఆలయ 54వ వార్షిక బ్రహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. శ్రీ భూనీలా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్లకు 108 కళశాలలో అభిషేకం, అనంతరం భక్తులకు, బాటసారులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నిత్య హోమం నిర్వహించి ఎదురుకోల్లు నిర్వహించారు. బుధవారం ఉదయం లక్ష్మీ హవనము, మధ్యాహ్నం శ్రీ భూనీలా సమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్ల కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ, సాయంత్రం నిత్య హోమం, సామూహిక కుంకుమార్చన జరుగుతాయని ఆలయ అధ్యక్షుడు మాంకాల నవీన్‌కుమార్ తెలిపారు.

చేనేత కార్మికుల ఫిర్యాదుపై విచారణ

సిద్దిపేట జోన్: చేనేత కార్మికుల ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధించిన శాఖ అధికారులు సిద్దిపేటలో విచారణ చేపట్టారు. సిద్దిపేటకు చెందిన చేనేత వస్త్ర వ్యాపారి, మాస్టర్ బుచ్చయ్య తమ ప్రమేయం లేకుండా పవర్ లూమ్ యంత్రాలు పొంది, తమకు ఇవ్వడం లేదని చేనేత కార్మికులు హైదరాబాద్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఏడాది క్రితం ఆరుగురు పేరిట పవర్ లూమ్స్, మిగతా నలుగురు పేరిట ముడి సరుకుల డబ్బులు ప్రభుత్వం నుంచి తమ ప్రమేయం లేకుండా పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర అధికారులు, జిల్లా అధికారి సంతోష్ ఫిర్యాదు చేసినవారిని విచారించారు. ప్రభుత్వ పవర్ లూమ్ గ్రాంట్‌లో లబ్ధిదారుల వాటా రూ.3,650 కార్మికుల పేరిట మాస్టర్ చెల్లించి, వారికి పవర్ లూమ్స్ ఇవ్వలేదని విచారణలో తేలిందని జిల్లా అధికారి పేర్కొన్నారు. పూర్తిగా విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేయాలి

నంగునూరు(సిద్దిపేట): గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు నూతన చైర్మన్ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సాదుల పవన్‌కుమార్ అన్నారు. మంగళవారం నంగునూరులో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడం హర్షణీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ చైర్మన్‌గా ఎన్నికైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డికి అభినందనలు తెలిపారు.

అయినాపూర్‌లో మెగా హెల్త్ క్యాంపు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ (ఎవరెస్టు హైదరాబాద్), లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు మంగళవారం నిర్వహించారు. మధుమేహం, కంటి చూపు, దంత, గుండె జబ్బుల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మల్టిపుల్ వైస్ చైర్మన్ జలారి రఘు, జిల్లా గవర్నర్ హరినారాయణ్ బట్టాడ్, క్లబ్ సెక్రటరీ జిల్లా రవీందర్, ప్రెసిడెంట్ అరవింద్ కుమార్, డాక్టర్లు దామోదర్ రెడ్డి, మహేందర్ రెడ్డి యశోద, సాయిరాం కంటి ఆసుపత్రి సిబ్బంది, రసులాబాద్ మాజీ సర్పంచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల వాన: దెబ్బతిన్న పంటలు



మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు



వీరాపూర్‌లో పడిన వడగళ్లు

దుబ్బాక రూరల్: వడగండ్ల వానతో సాగుచేస్తున్న పంటలు దెబ్బతిన్నాయి. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట, నగరం, తాళ్లపల్లి గ్రామాల రైతులు సాగుచేస్తున్న వరి, మొక్కజొన్న, మామిడితోటలు నేలవాలాయి. మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసింది. పలు చోట్ల వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడికాయలు నేలరాలాయి. వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాన్స్ ఉమెన్స్‌పై వివక్ష చూపొద్దు

జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ

సిద్దిపేటరూరల్: ట్రాన్స్ ఉమెన్స్‌పై వివక్ష చూపొద్దని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సరోజ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు శివకుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాన్స్ ఉమెన్స్ తమ స్వశక్తితో ఎదగాలన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ బోర్డు మెంబర్ రచన, డీపీఓ దేవకీదేవి, సెట్విన్ కోఆర్డినేటర్ అమీనాభాను, ప్రొఫెసర్ సమతారోషిని, జిలా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి కవిత, మహిళా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నివేదికల తయారీపై వర్క్‌షాప్



ప్రాజెక్టుల నివేదిక తయారీపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకుడు డాక్టర్ గోపాల సుదర్శనం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ గోపాల సుదర్శనం అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బీకాం విద్యార్థులకు ప్రాజెక్టుల నివేదికల తయారీపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ స్థాయిలో ప్రాజెక్టుల తయారీ విద్యార్థుల భవిష్యత్ కార్యాచరణకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తమలోని ప్రతిభకు పదును పెడుతూ నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకులు డాక్టర్ బాలచంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు పెంచాలి

ఎంపీడీఓ రామ్మోహన్



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామ్మోహన్

మద్దూరు(హుస్నాబాద్): గ్రామ పంచాయతీకి కేటాయించిన మొక్కలను పెంచాలని, లక్ష్యం మేరకు మొక్కలను పెంచి వర్షాకాలంలో నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ రామ్మోహన్ నర్సరీల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. కూలీలు కొలత ప్రకారమే పనిచేయాలన్నారు. కూలీలు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆయన వెంట ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి అనిత ఉన్నారు.

భూంపల్లి ఎస్ఐగా రవికాంత్‌రావు



రవికాంత్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐగా వి.రవికాంత్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన బేగంపేటలో పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా ఇక్కడ పనిచేసిన భువనేశ్వర్‌రావు బేగంపేటకు బదిలీ అయ్యారు.

మల్లు స్వరాజ్యం పోరాటం మరువలేనిది



కొమురవెల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

దుబ్బాక: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా మల్లు స్వరాజ్యం చేసిన పోరాటం మరువలేనిదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం దుబ్బాకలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలు, దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి మల్లు స్వరాజ్యం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొంపల్లి భాస్కర్, రాజు, మల్లేశం, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీందర్, ఇస్తారి, మల్లేశం, శారద, మల్లవ్వ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో నివాళులర్పిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం చేర్యాల పార్టీ కార్యాలయంలో మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాలను దృఢంగా నమ్మిన మల్లు స్వరాజ్యం తన 16వ ఏటనే ఉద్యమంలోకి వచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, సత్తిరెడ్డి, వెంకట్, మావో, నాగరాజు, కృష్ణారెడ్డి, అరుణ్, శోభ, రమ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం**



ములుగు(గజ్వేల్): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని పార్టీ ములుగు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని బస్వాపూర్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రజలు నరేంద్ర మోదీ నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమమే అజెండాగా బీజేపీ ప్రజల వద్దకు వెళ్తోందన్నారు. పార్టీ అధిష్టానం తనపై విశ్వాసంతో అప్పగించిన మండల అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నేతల సహకారంతో నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహులు, మదార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ **వ్యక్తిగత శుభ్రత పాటించాలి**

మిరుదొడ్డి(దుబ్బాక): పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ, మిరుదొడ్డి స్పెషల్ ఆఫీసర్ గణేష్ రెడ్డి కోరారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ప్రతి వీధిలో ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫహీం తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధిత కుటుంబానికి పరామర్శ**

దుబ్బాకటౌన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుబ్బాక అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఆస ముత్యం కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మున్సిపల్ కోఆప్షన్ మెంబర్లు ఆస స్వామి, ఆసీఫ్, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూంరెడ్డి, శ్రీరాం రవీందర్ తదితరులు ఉన్నారు.

◆ **ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి**

నంగునూరు(సిద్దిపేట): ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. దేశ్‌పాండే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నర్మేట ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంగ్లంలో ఉపన్యాసం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రాజెక్ట్ వర్క్ ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

◆ **భక్తులకు ఘన స్వాగతం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీశ్రీశ్రీ ఆది జగద్గురు రేణుక ఆచార్య జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా గుడిమెట్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక వరకు శ్రీ సద్గురు మహాదేవ్ స్వామిజీ ఆధ్వర్యంలో మహా పాదయాత్ర చేస్తున్న భక్తులకు మంగళవారం సిద్దిపేట వీరశైవ లింగ బలిజ సమాజం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సిద్దిపేటలోని శ్రీ ఉమాపార్థీశ్వర కోటిలింగాల ఆలయంలో పాదయాత్ర చేస్తున్న భక్తులకు అన్నదానం, అనంతరం గురువులకు సన్మానాలు చేశారు.

◆ **ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర (పాత) ఆలయ వార్షికోత్సవాలకు హాజరుకావాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే, బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మంగళవారం ఆహ్వాన పత్రికను ఉత్సవ నిర్వాహకులు అందజేశారు. ఉత్సవాలకు రావాలని నిర్వాహకులు కోరినట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోడుపునూరి వెంకటేశం తెలిపారు.

◆ **పాండవుల చెరువు పరిశీలన**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కోటమైసమ్మ సమీపంలోగల పాండవుల చెరువును గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మంగళవారం సందర్శించారు. కట్టపై ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి తదితర వస్తువులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నుల వసూళ్లపై ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. వందశాతం పన్నులు వసూలయ్యేలా కృషి చేయాలని సూచించారు.

◆ **వాటర్ ప్లాంట్లో దొంగతనం**

కొండపాక(గజ్వేల్): మండల పరిధి ఖమ్మంపల్లి గ్రామంలోని వాటర్ ప్లాంట్, మిల్క్ సెంటరులో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. వాటర్ ప్లాంట్‌లో ఉన్న సీసీ కెమెరా పుటేజీలను మంగళవారం పరిశీలించారు. రూ.2300 చోరీకి గురైనట్లు గమనించారు. చోరీకి పాల్పడింది గ్రామానికి చెందిన కొండాపురం రాజుగా గుర్తించారు. వెంటనే అతడిని పట్టుకొని గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.